అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 225. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ ఆదివారం.25.05.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## జూబ్లీహిల్స్‌లో హైడ్రా

అమృత్ తెలంగాణ: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 41లో.. రోడ్డుతో పాటు నాలానూ ఆక్రమించి నిర్మించిన కట్టడాలను హైడ్రా శుక్రవారం తొలగించింది. 30 అడుగుల రహదారిలో ఆక్రమణలు తొలగించి 2 ఎకరాల పార్కుకు దారి చూపింది. దాదాపు రూ. 200 కోట్ల ఆస్తిని కాపాడి.. ప్రజా వినియోగంలోకి హైడ్రా తెచ్చింది. జూబ్లీహిల్స్ సొసైటీ ప్రతినిధులు, అక్కడ నివాస ప్రాంతాలకు చెందిన వారు ఇచ్చిన ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో ఇది వరకే పరిశీలించారు. నాలాతో పాటు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్టు నిర్ధారణ కావడంతో వాటి తొలగింపునకు హైడ్రా గతంలోనే నోటీసులు ఇచ్చింది. కోర్టునుంచి అనుమతులు లభించడంతో బుధవారం అక్రమ నిర్మాణాలను హైడ్రా తొలగించింది.

## గడ్చిరోలిలో మళ్లీ ఎన్‌కౌంటర్

మహదేవపూర్ : అమృత్ తెలంగాణ:మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గడ్చిరోలి జిల్లాలోని భమ్రాగఢ్ తాలూకాలో గడ్చిరోలి జిల్లా పోలీస్–సీ60 స్పెషల్ టీమ్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది శుక్రవారం కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మావోయిస్టులకు, పోలీసులకు మధ్య దాదాపు 36 గంటలపాటు సాగిన ఎదురుకాల్పుల్లో భమ్రాగఢ్ దళం కమాండర్‌తో పాటు ముగ్గురు దళ సభ్యులతో కలిపి నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. వీరివద్ద ఒక ఎస్ఎల్, రెండు 303 రైఫిల్స్, ఒక భార్మార్ సహా మొత్తం 4 తుపాకులు, సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టులను రూపుమాపేందుకు భమ్రాగఢ్ సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల కొత్తగా పోలీస్‌స్టేషన్‌ను నిర్మిం చారు. దీనిపై మావోయిస్టులు దాడి చేయాలనుకుంటున్నట్టు ఇంటిలిజెన్స్ వర్గాల నుంచి భద్రతాదళాలకు సమాచారం అందింది.

# కోవిడ్, డెంగీ పేరుతో దోపిడీ చేస్తే కఠిన చర్యలు



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: కోవిడ్, డెంగీ వ్యాధుల పేరుతో ప్రజలను ఆందోళనకు గురిచేసి, దోచుకునేందుకు ప్రయత్నిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో కరోనా వైరస్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా భారతదేశం, విదేశాల్లో ఉన్న కోవిడ్ పరిస్థితులను అధికారులు, ఎపిడమాలజిస్టు లు మంత్రికి వివరించారు. కొన్ని దేశాల్లో కోవిడ్ కేసులు స్వల్పంగా పెరిగినప్పటికీ, హాస్పిటలైజేషన్ చాలా తక్కువగా ఉందని తెలిపారు. ఇండియాలో పరిస్థితి సాధారణంగా ఉందని, జేఎన్ 1 వేరియంట్ కేసులు కొన్ని నమోదయ్యాయనీ, ఈ వేరియంట్ 2023 నుంచే ఇండియాలో వ్యాప్తిలో ఉందని వివరించారు. ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితులేమీ లేవని చెప్పారు. ఇతర దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారికి తప్పితే, ఇతరులెవరికీ హాస్పిటలైజేషన్ అవసరం పడడం లేదని వెల్లడించారు.

కేంద్ర ఆరోగ్యశాఖ నుంచి రాష్ట్రాలకు ఇప్పటి వరకూ అడ్వైజరీలు, గైడ్‌లైన్స్ ఏమీ రాలేదని అధికారులు మంత్రికి తెలిపారు. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉ ఒడడం, ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేకపోవడమే ఇందుకు కారణమై ఉండొచ్చునని వారు అభిప్రాయపడ్డారు. దాదాపు మూడు సంవత్సరాల క్రితమే కోవిడ్ ఎండెమిక్ స్టేజ్‌లోకి వచ్చిందనీ, అప్పుడప్పుడు కేసులు నమోదు అవడం, తగ్గడం, పెరగడం సహజమేనని ఎపిడమాలజిస్టులు మంత్రికి వివరించారు. ఇప్పుడున్న వాతావరణ పరిస్థి తులతో ప్రజలు దగ్గు, జలుబు, జ్వరాలు, శ్వాసకోశ వ్యాధుల బారిన పడే అవకాశం కూడా ఉంటుందన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ నమోదయ్యే కోవిడ్ కేసులను మేనేజ్ చేయడానికి అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని అధికారులు మంత్రికి తెలిపారు. టెస్టింగ్ కిట్స్, మెడిసిన్ సహా అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో పరిస్థితిని నిశితంగా గమనించాలని వారికి సూచించారు. కరోనా, సీజనల్ డిసీజ్‌ల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కోవిడ్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలను కోరారు. వర్షాకాలంలో సీజనల్ డిసీజ్‌ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జలుబు, దగ్గులాగే కోవిడ్ కూడా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందనీ, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, దగ్గు, జలుబు ఉన్నప్పుడు మాస్క్ ధరిం చడం వల్ల ఒకరి నుంచి ఒకరికి వైరస్‌లు వ్యాపించకుండా ఉంటాయన్నారు. నీటి నిల్వ ఉ ంటే దోమలు పెరిగి, వ్యాధులు వ్యాపించే ప్రమాదముంటుందనీ, ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పేందుకు అన్ని గ్రామాలు, పట్టణాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై పంచాయతీరాజ్, మున్సిపల్, ఇతర శాఖలతో కలిసి పని చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి, డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, డీహెచ్ డాక్టర్ రవిందర్ నాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజరుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వివాదంలో అందాల పోటీలు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీల్లో కొత్త వివాదం నడుస్తోంది. నిర్వాహకుల తీరు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పోటీల్లో పాల్గొం టున్న పోటీదారులకు మింగుడు పడటం లేదు. మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలే ఇందుకు నిదర్శనం. వ్యక్తిగత కారణాలతో పోటీల నుంచి తప్పుకున్నానని పేర్కొంటూ మే16న ఆమె ఇంగ్లాండ్ వెళ్లిపోయారు. అయితే అక్కడికి వెళ్లిన తర్వాత ఆమె మిస్‌వరల్డ్ సంస్థపై సంచలన ఆరోపణలు చేశారు. ప్రఖ్యాత సన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి. మధ్య వయస్సున్న పురుషులను ఆనందపెట్టాలని తమపై ఒత్తిడి తీసుకొచ్చారనీ, తమను వేశ్యకంటే అధ్వానంగా చూశారంటూ ఆమె నిర్వాహకులపై విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో మనస్తాపంతో హైదరాబాద్ నుంచి తిరిగొచ్చినట్టు చెప్పారు. ఆమె వ్యాఖ్యలు తెలుగు మీడియాతో పాటు జాతీయ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోల్ అవుతున్నాయి.

ఆరోపణలు అవాస్తవం : జూలియా మోర్లే

మిస్ వరల్డ్ పోటీల నుంచి తప్పుకుని స్వదేశం వెళ్లిన మిస్ ఇంగ్లాండ్ 2025 మిల్లా మాగీ చేసిన ఆరోపణలను నిర్వాహకులు కొట్టి పారేశారు. ఈ మేరకు శనివారం మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే ఒక ప్రకటన విడుదల చేశారు. "మే మొదటి వారంలో మిస్ ఇంగ్లాండ్ మిల్లా తన తల్లి ఆరోగ్యం బాగా లేనందున పోటీల నుంచి విరమించుకుంటున్నట్టు సంస్థకు తెలిపారు. ఆమె పరిస్థితిని అర్థం చేసుకొని ఇంగ్లాండ్‌కు తిరిగి పంపే ఏర్పాట్లు చేశాం. పోటీల నుంచి వైదొలిగిన తర్వాత, మిస్ ఇంగ్లాండ్ రన్నరప్ మిస్ షార్లెట్ గ్రాంట్ ఇంగ్లాండ్ తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ముందుకొచ్చారు. ఆమె పోటీలో పాల్గొనేందుకు అను మతిచ్చాం" అని మోర్లే తెలిపారు. బ్రిటిష్ మీడియా సంస్థలు మిల్లా మాగీ పోటీలో అనుభవా లపై తప్పుడు, కథనాలను ప్రచు రిస్తున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. మిస్ వరల్డ్ సంస్థ నిజా యితీ, గౌరవం, "బ్యూటీ విత్ ఎ పర్పస్" అనే విలువలకు అద్దం పట్టేలా పోటీలు కొనసాగు తున్నాయని తెలిపారు. మీడియా సంస్థలు జర్నలిస్టిక్ విలువలు పాటిస్తూ, తప్పుడు సమాచారాన్ని ప్రచురించే ముందు వాస్తవాలను ధృవీకరించుకోవాలని కోరారు.

వేధించిందెవరు?

ప్రపంచ దేశాల నుంచి వచ్చిన యువతులను వేధించింది ఎవరన్న విషయం తెలియాల్సిన అవసరముందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఆ వేధింపులకు కారణమైంది ఎవరు? ఆనంద పెట్టాలని నిర్వాహకులు ఎవరి కోసం వారిపై ఒత్తిడి తీసుకొచ్చారు? ఆ వ్యక్తులు ఎవరు? ఈ అంశాలన్నీ బయటకు రావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మిల్లా ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపితే గానీ వాస్తవాలు బయటరావు. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోతే అనేక అనుమానా లకు తావిచ్చినట్టవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అభివృద్ధి వేగాన్ని పెంచాలి




న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: కేంద్రం, రాష్ట్రాలు టీమిండియా లాగా కలిసి పనిచేస్తే, ఏ లక్ష్యమూ అసాధ్యం కాదని ప్రధాని మోడీ అన్నారు. న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో గల భారత్ మండపంలో ప్రధాని అధ్యక్షతన నిటి ఆయోగ్ 10వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. 'వికసిత రాజ్యం కోసం వికసిత భారత్–2047' అనే ఇతివృత్తంతో జరిగిన ఈ సమావేశంలో దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతా(యూటీ)ల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు(ఎల్జీలు) పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత మోడీ అధ్యక్షతన జరుగుతున్న మొదటి ప్రధాన సమావేశం ఇదే కావటం గమనార్హం. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ అభివృద్ధి వేగాన్ని పెంచాల్సిన అవసరం ఉన్నదన్నారు. "మనం అభివృద్ధి వేగాన్ని పెంచాలి. కేంద్రం, అన్ని రాష్ట్రాలూ కలిసి వచ్చి టీమిండియాలాగా కలిసి పనిచేస్తే, ఏ లక్ష్యమూ అసాధ్యం కాదు. వికసిత్ భారత్ ప్రతి భారతీయుడి లక్ష్యం. ప్రతి రాష్ట్రం వికసితం అయినప్పుడు, భారత్ వికసితం అవుతుంది. ఇది దాని 140 కోట్ల మంది పౌరుల ఆకాంక్ష" అని మోడీ అన్నారు.

దీర్ఘకాలిక, సమగ్ర దార్శనిక పత్రాలు రూపొందించాలి : నిటి ఆయోగ్

వికసిత రాజ్యం కోసం వికసిత భారత్ అనే భావన రాష్ట్రాలు జాతీయ ప్రాధాన్యతలు, స్థానిక వాస్తవాలకు అనుగుణంగా దీర్ఘకాలిక, సమగ్రమైన దార్శనిక పత్రాలను రూపొందించాలని నిటి ఆయోగ్ పిలుపునిచ్చింది. ఈ దార్శనిక పత్రాలు కాలపరిమిత లక్ష్యాలను కలిగి ఉండాలనీ, అవి రాష్ట్రాల భౌగోళిక, జనాభా పరమైన ప్రత్యేకతలను సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. మానవ వనరుల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి, సుస్థిరత, సాంకేతికత, పాలన సంస్కరణలపై దృష్టి కేంద్రీకరించటం ద్వారా రాష్ట్రాలు ఈ లక్ష్యాలను సాధించగలవని వివరించింది. డేటా ఆధారిత ప్రక్రియలు, ఫలిత ఆధారిత మార్పును ప్రోత్సహించే చర్చలు జరిగాయి. ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లు, సమాచార సాంకేతికత (ఐసీటీ) ఆధారిత మాధ్యమాలు, పర్యవేక్షణ, మదింపు విభాగాలతో జవాబుదారీతనం వంటివి కీలకమైన అంశాలుగా ఉన్నాయి. ఈ చర్యలు రాష్ట్రాలు తమ అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి సహాయపడతాయని నిటి ఆయోగ్ అభిప్రాయపడింది. ఈ సమావేశంలో వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, నైపుణ్య అభివద్ధిని మెరుగుపరచడం, స్థిరమైన ఉ పాధి అవకాశాలను సృష్టించడం వంటి అంశాలపై కూడా చర్చించారు.

కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరం

దేశవ్యాప్తంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించడం, వ్యాపారవేత్తలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, ఉద్యోగ అవకాశాలను పెంచడం వంటి వ్యూహాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రాలు తమ ప్రత్యేక బలాలను ఉపయోగించుకుని, ఈ లక్ష్యాలను సాధించేందుకు సమర్థవంతమైన విధానాలను రూపొందించాలని నిటి ఆయోగ్ సూచించింది. కేంద్రం, రాష్ట్రాలు, యూటీల మధ్య సమన్వయాన్ని పెంచే ఒక వేదికగా పనిచేస్తుందని వివరించింది. దేశం ఎదుర్కొంటున్న అభివృద్ధి సవాళ్లను పరిష్కరించడానికి, భారత్‌ను వికసిత దేశంగా మార్చడానికి రాష్ట్రాలు ప్రధాన భాగస్వాములుగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపింది.

సమగ్రమైన, సుస్థిరమైన అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర సహకారం అత్యంత కీలకమని నిటి ఆయోగ్ నొక్కి చెప్పింది. ఈ సమావేశానికి కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేరళ సీఎం పినరయి విజయన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ గైర్హాజరు అయ్యారు. సాధారణంగా, పూర్తి కౌన్సిల్ సమావేశం ప్రతి ఏడాదీ జరుగుతుంది. గతేడాది జులై 27న దీనిని నిర్వహించారు. కౌన్సిల్ మొదటి సమావేశం ఫిబ్రవరి 8, 2015లో జరిగింది. ఈ కౌన్సిల్‌లో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, యూటీల ఎల్జీలు, పలువురు కేంద్ర మంత్రులు ఉంటారు. నిటి ఆయోగ్‌కు ప్రధాని చైర్మన్‌గా ఉంటారు.

# కవిత సంచలన లేఖపై స్పందించిన కేటీఆర్..




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ఆయన కుమార్తె కల్వకుంట్ల కవిత రాసిన లేఖ ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ లేఖ బయటకురావడంపై కవిత తీవ్రంగా మండిపడ్డారు. కేసీఆర్ దేవుడని, ఆయన చుట్టూ కొన్ని దయ్యాలు చేరాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కాంగ్రెస్ కోవర్టులు ఉన్నారని, తన తండ్రికి తాను రాసిన లేఖ బయటకు రావడమే దీనికి నిదర్శనమని కవిత చెప్పారు. కవిత రాసిన లేఖపై ఆమె సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్ శనివారం స్పందించారు.

పార్టీ ప్రధాన కార్యాలయం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొన్ని అంతర్గత విషయాలను పార్టీలో అంతర్గతంగానే చర్చించాలని హితవు పలికారు. పార్టీలో తనతో సహా అందరూ కార్యకర్తలేనని, ఈ నియమం అందరికీ వర్తిస్తుందని స్పష్టం చేశారు. వాస్తవానికి నేషనల్ హెరాల్డ్ కేసులో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై వచ్చిన ఆరోపణలపై మాట్లాడేందుకు కేటీఆర్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. అయితే, కవిత లేఖపై స్పందించాలంటూ మీడియా ప్రతినిధులు కోరగా.. ఆయన ముక్తసరిగా స్పందించారు. రెండు ముక్కల్లో విషయం తేల్చేసి, దానిపై ఇక మాట్లాడేదీ లేదని చెప్పారు.పార్టీలో దయ్యాలు ఉ న్నారని కవిత చేసిన ఆరోపణలపై ఏమంటారని అడగగా.. ప్రస్తుతం తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్, దయ్యం రేవంత్ రెడ్డి అని చెప్పారు. రాష్ట్రానికి పట్టిన ఆ శనిని, ఆ దయ్యాన్ని వదిలించడంపైనే తాము, తమ పార్టీ దృష్టి సారించిందని కేటీఆర్ చెప్పారు. బీఆర్ఎస్ పార్టీలో కోవర్టులు ఉన్నారన్న ఆరోపణలపై స్పందిస్తూ.. ప్రతీ పార్టీలోనూ కోవర్టులు ఉంటారని, సమయం వచ్చినప్పుడు వారు ఎవరనేది బయటపడుతుందని వివరించారు. బీఆర్ఎస్ ప్రజల పార్టీ అని, ప్రజాస్వామ్యబద్ధమైన పార్టీ అని కేటీఆర్ చెప్పారు.పార్టీలో ఏ కార్యకర్త అయినా తన అభిప్రాయాలను, సూచనలను అధ్యక్షుడికి తెలియజేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ అభిప్రాయ వెల్లడి అనేది మౌఖికంగా, లేఖల ద్వారా, ఫోన్ ద్వారా, నేరుగా కలిసి మాట్లాడడం ద్వారా.. ఇలా వివిధ పద్ధతులలో జరుగుతుంటుందని వివరించారు. అయితే, కొన్ని విషయాలను అంతర్గతంగా చర్చించాల్సి ఉ ంటుందని, వాటిని అంతర్గతంగానే చర్చించాలని కేటీఆర్ చెప్పారు. కాగా, ప్రెస్ మీట్ పూర్తయ్యేవరకూ కేటీఆర్ తన సోదరి కవిత పేరెత్తకపోవడం గమనార్హం.

# తెలుగు చిత్రసీమకు కనీస కృతజ్ఞత లేదు..

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: తెలుగు చిత్ర పరిశ్రమ తీరుపై ఏపీ ఉపముఖ్యమంత్రి, హీరో పవన్‌కళ్యాణ్ మండి పడ్డారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు సినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించి, అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే, తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదని కోపం వ్యక్తం చేశారు. ఎన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని తెలుగు సినిమా సంఘాలు కనీసం ఒకసారి కూడా మర్యాదపూర్వకంగా ఎందుకు కలవలేదని ఆయన ప్రశ్నించారు.

పవన్‌కళ్యాణ్ నటించిన 'హరి హరి వీరమల్లు' చిత్రం జూన్ 12వ తేదీన విడుదల కానుంది. అయితే జూన్ 1వ తేదీ నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల బంద్ అనే వార్తతోపాటు తెలుగు సినీ పరిశ్రమ అనుసరిస్తున్న తీరుపై ఆయన ఘాటుగా స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.

తెలుగు సినిమా రంగంలోని అగ్ర నటులను, సాంకేతిక నిపుణులను గత ప్రభుత్వం ఏ విధంగా ఛీత్కరించుకుని, ఇక్కట్ల పాల్జేసిందో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, మూవీ ఆరిస్ట్స్ అసోసియేషన్ లాంటి సంఘాలు మరచిపోయినట్లున్నాయి.

టిక్కెట్ ధర పెంచమనే విషయంలో అందరూ కలసి వచ్చి ప్రభుత్వంతో స్పష్టంగా చర్చించమని సూచించినా, ఆ సూచనని పట్టించుకోకుండా ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి తమ సినిమాలకు టికెట్ ధరలు పెంచమని సినిమాటోగ్రఫీ శాఖకి అర్జీలు ఇస్తూ వచ్చారు. అయినప్పటికీ ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూనే ఉంది.

తెలుగు సినిమాకి చెందిన కొందరు ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్‌ను కూడా తగిన విధంగానే స్వీకరిస్తాం. ఈ రిటర్న్ గిఫ్ట్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఇక నుంచి వ్యక్తిగత విజ్ఞాపనలు, చర్చలకు తావులేదు. సంబంధిత విభాగం ప్రతినిధుల తోనే చర్చిస్తాం. వాటినే సంబంధిత విభాగాలకు పంపిస్తాం.

# గుజరాత్‌లో పాక్ గూఢచారి అరెస్ట్..

న్యూఢిల్లీ: అమృత్ తెలంగాణ: భారత వైమానిక దళం, భారత సరిహద్దు భద్రతా దళం.. దేశ రక్షణలో ఎంతో కీలకమైన ఈ రెండు వ్యవస్థల సమాచారాన్ని పాకిస్తాన్ ఏజెంట్ కు చేరవేస్తున్న గుజరాత్ కు చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని గుజరాత్?లోని కచ్ ప్రాంతానికి చెందిన సహదేవ్ సింగ్ గోహిల్ అని, అతను హెల్త్ వర్కర్?గా పనిచేస్తున్నాడని గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ సీనియర్ అధికారి కె సిద్ధార్థ్ మీడియాకు తెలిపారు.

# తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజి జెడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్..

## అధికారులు చొరవ తీసుకొని లారీలను అందుబాటులో ఉంచాలి..





అమృత్ తెలంగాణ ముధోల్ నియోజకవర్గం న్యూస్ : ముధోల్ నియోజకవర్గంలోని



లోలం శ్యాంసుందర్ ఉమ్మడి అదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్

అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని తక్షణం అధికారులు చొరవ తీసుకొని లారీలను అందుబాటులోకి తీసుకువచ్చి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ముధోల్ నియోజకవర్గ బి ఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యులు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యామ్ సుందర్ మాట్లాడుతూ... రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవాలంటే నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు గత నాలుగు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి అన్నదాత కు కంటిమీద కునుకు లేకుండా పోయింది ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇలానే ఇంకా తాత్సారం చేస్తే నియోజకవర్గంలోని రైతులతో కలిసి బి ఆర్ఎస్ పార్టీ తరుపున ఆందోళనలు తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు

# తెలంగాణ ఉద్యమ పోరాటలిసంఘం అదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నట్టల స్వప్నకు నివాళులు



నివాళులర్పిస్తున్న తెలంగాణ నిరుద్యోగ ఉద్యమకారులు

అమృత్ తెలంగాణన్యూస్ . తెలంగాణలోని నారాయణపేట జిల్లా గుండుమల్ మండలం భక్తిమల్లా గ్రామానికి చెందిన నట్టల స్వప్న డాన్సర్ గా తెలంగాణ ఉద్యమం నుండి నేటి వరకు నిరంతరంగా తన ఆటతో ఎందరో మందిని ఉర్రూతలూగించినటువంటి స్వప్న ఆర్థిక ఇబ్బందుల వల్ల మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడం జరిగింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ సాంస్కృతిక సారధినీ పెట్టి 550 మందికి ఉద్యోగలు కల్పించడం జరిగింది కానీ నిజమైనటువంటి నికాస్ అయినటువంటి ఉద్యమ కళాకారులు ఇంకా చాలామంది బ్రతుకుతున్నారు తెలంగాణ సాంస్కృతిక సారధిలో ఉద్యోగం వస్తే ఈరోజు నట్టల స్వప్న ఆత్మహత్యకు పాల్పడేది కాదు దయచేసి ఏ కళాకారులైన ఓటమిని ఎదుర్కొని యుద్ధం చేయాలి కానీ ఇలా క్షణాల్లో నిర్ణయం తీసుకొని ఆత్మహత్యకు పాల్పడకూడదు అని తెలియజేస్తూ ఎక్కడున్నా నీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మీ కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆ భగవంతున్ని మనస్ఫూర్తిగా కోరుకుంటూ తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం ఆదిలాబాద్ జిల్లా

# మాజీ మంత్రిని అవమానిస్తే సహించేది లేదు..యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి



యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హైమద్ ముక్తార్,

నిర్మల్ జిల్లా మే 24 అమృత్ తెలంగాణ ఇటీవల తెలంగాణ భవన్ హైదరాబాద్ లో నిర్మల్ జిల్లా బిఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్థానిక మాజీ మంత్రి గారి గురించి అవహేళన గా మాట్లాడాన్ని తీవ్రంగా ఖండించిన యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అహ్మద్ ముక్తార్, . తమ పార్టీ రోజుకో సంక్షోభంలో చిక్కుకుంటున్న తరుణంలో ఉన్న కొద్దిమంది నాయకులను ఆకట్టుకోవడానికోసం మాజీ మంత్రిని అవమానిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించడం జరిగింది.తన బావ హరీష్ రావు ఎప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడో అని, సోదరి కూడా వేరు కుంపటి కి ప్రయత్నాలు చేస్తున్న సందర్భంలో అభద్రత భావంలో ఉన్న కేటీఆర్ తన కుటుంబ సభ్యులను అనవలసిన మాటలను,ఇతర నాయకులకు ఆపాదించడం తప్పు.ఇంద్రకరణ్ రెడ్డి, రాజకీయాల్లోకి వచ్చినపుడు నీకు రాజకీయ ఓనమాలు కూడా తెలియవు.పెద్ద నాయకులను విమర్శిస్తే పెద్ద నాయకుడు అయితవని అనుకోవడం నీ తెలివి తక్కువ తననికి నిదర్శనం.మీ అయ్య టిఆర్ఎస్ పార్టీ స్థాపించక ముందే తెలంగాణ ప్రాంత ఏమ్మెల్యే లను ఏకతాటిపైకి తీసుకొచ్చి హస్తినకు తీసుకెళ్లి తెలంగాణ అవశ్యకతను తెలియచేసిన నాయకుడు.మళ్ళీ దశ ఉద్యమంలో ఆమరణ నిరాహార దీక్ష చేసి ఉద్యమాన్ని ముందుకు నడిపిన నాయకుడి గురించి చిల్లర మాటలు మానుకోవాలని హెచ్చరించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి..

కమ్మర్ పల్లి:అమృత్ తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు పెంచడంతోపాటు ప్రైవేటుకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుటకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి నేర ఆంధ్రయ్య అన్నారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాల పెంపు కొరకు గత ఐదు రోజులుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. శిక్షణ ముగింపు కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్, మండల విద్యాధికారి ఆంధ్రయ్య మాట్లాడుతూ తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానంలో తరగతి గదిలో విద్యార్థులకు సులభమైన రీతిలో నేర్పడం ఎలా అనే అంశాలపై, మెరుగైన అభ్యసన ఫలితాలు సాధించుటకు ఉపాధ్యాయులకు ఐదు రోజులపాటు రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇచ్చారన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు పెంచడంలో తన వంతు పాత్ర పోషించాలన్నారు. ప్రైవేటుకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుటకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కృత్యాధార బోధన చేసినప్పుడే మెరుగైన



అభ్యసన ఫలితాలు వస్తాయని ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు చంద్రశేఖర్, రవీందర్, వేణుగోపాల్, అశోక్, శంకర్ గౌడ్, మారుతి, పసుపుల ప్రసాద్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల వల్ల రైతులు ఆందోళన చెందవద్దు

## తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

## రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం

## ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ముధోల్ మే 24 అమృత్ తెలంగాణ ముధోల్ నియోజకవర్గం లో అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ డిమాండ్ చేశారు. శనివారం వానల్ పాడ్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తేమ శాతం పేరుతో రైతులను వేధించవద్దన్నారు. లారీలను సత్వరం రప్పించి , కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యాన్ని తరలించవలసిందిగా అధికారులకు సూచించారు. హమాలీలను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసుకొని ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలని సూచించారు. రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రైతుల కు సంబంధించిన పూర్తిస్థాయి ధాన్యాన్ని కొనుగోలు చేయిస్తానని, అవసరమైతే రైతుల పక్షాన పోరాటం చేస్తానని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాల్సిందిగా అధికారులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట బిజెపి నాయకులు భీమినేని శంకర్, పట్టణ అధ్యక్షులు రావుల రాము, చందర్ పటేల్, సాయ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# నర్సాపూర్ జి 30 పడకల ఆసుపత్రిలో ఎక్స్ రే మిషన్ ప్రారంభించిన బీజేఎల్పి నేత మహేశ్వర్ రెడ్డి




ఎక్స్రే రే మిషను ప్రారంభించిన బీజేఎల్పి నేత మహేశ్వర్ రెడ్డి



డాక్టర్లతో మాట్లాడుతున్న బిజెఎల్పి నేత

నర్సాపూర్ జి మే 24 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రంలోని 30పడకల సామాజిక ఆసుపత్రి లో కొత్త ఎక్స్ రే మిషన్ ను ప్రారంభించిన తెలంగాణ శాసనసభ పక్ష నేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆయన మాట్లాడుతూ పేదల కు అన్ని సౌకర్యాలతో ప్రభుత్వ ఆసుపత్రి లో వైద్య సౌకర్యాలు అన్ని విధంగా డాక్టర్లు సంబంధిత సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అన్ని రకాల వైద్య పరీక్షలు మునుముందు అందే విధంగా ప్రయత్నం చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్, తాసిల్దార్ శ్రీకాంత్, డ్యూటీ డాక్టర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు

# గ్రామ పాలన అధికారుల రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు జిల్లా పాలనాధికారి రాజర్షి షా



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : గ్రామ పాలన అధికారుల నియామకం కోసం ఈ నెల 25న (ఆదివారం) జరిగే రాత పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రాత పరీక్ష నిర్వహణ ఏర్పాట్ల పై శనివారం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పాలన అధికారుల రాత పరీక్ష కోసం చేపట్టిన చర్యల గురించి ఆయా శాఖల వారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా రాత పరీక్ష జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో 83 మంది అభ్యర్థులు గ్రామ పాలన అధికారుల నియామక రాత పరీక్షకు హాజరు కానున్నారని, వీరికి నలంద డిగ్రీ కళాశాల మావల మండలం లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.30 గంట వరకు పరీక్ష కొనసాగుతుందని సూచించారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని హితవు పలికారు. పరీక్ష ప్రారంభం అయిన మీదట ఆలస్యంగా వచ్చే వారిని లోనికి అనుమతించరని స్పష్టం చేశారు. కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా పర్యవేక్షణ జరపాలని, నియమ నిబంధనలు తు.చ తప్పకుండా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రంలోని అన్ని గదులలో అభ్యర్థులకు తగిన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్ , జిల్లా రవాణా అధికారి , కలెక్టరేట్ ఏ.ఓ తదితరులు పాల్గొన్నారు

# జిపిఓ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి : అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లా కేంద్రంలో రేపు నిర్వహించనున్న గ్రామ పాలన అధికారుల నియామక పరీక్షకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ శనివారం ఒక ప్రకటన తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 9 గంటలలోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. చాణక్య హై స్కూల్ (రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో) లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. సెల్‌ఫోన్ సహా ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను తప్పనిసరిగా తీసుకురావాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

# తహసిల్దార్ ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



కమ్మర్ పల్లి: అమృత్ తెలంగాణ: కమ్మర్ పల్లి మండల నూతన తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన గుడిమెల ప్రసాద్ ను కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి ఆధ్వర్యంలో నూతన తహసిల్దార్ ను ఆయన చాంబర్ లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగాఆయనను సుంకేట రవి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, కిషన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగేల ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని రైతులకు తెలియ జేయునది ఏమనగా జిల్లా లో ఇప్పటి వరకు 15 లక్షల పత్తి విత్తన పాకెట్లు




జిల్లా పాలన అధికారి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి జిల్లాలోని రైతులకు తెలియ జేయునది ఏమనగా జిల్లా లో ఇప్పటి వరకు 15 లక్షల పత్తి విత్తన పాకెట్లు వివిధ మండలాలలోని డీలర్ ల వద్ద అందుబాటులో ఉంచడం జరిగినదని అలాగే 55000 mts ల ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రైతులు ప్రత్తి విత్తనాలను ఎరువులను కనుగోలు చేసేటప్పుడు ఈ క్రింది సూచనలు పాటించాలన్నారు..

1. విత్తనాలను మరియు ఎరువులు అధీకృత డీలర్ నుండి మాత్రమే కనుగోలు చేయవలెను.

2. కనుగోలు చేయునపుడు రసీదును విధిగా పోదవలెను రసీదును మరియు విత్తన ప్యాకెట్ ను పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్రపరుచవలెను.

3. గ్రామాలలో అమ్మే నకిలి విత్తనాలను, Loose విత్తనాలను ప్రభుత్వం నిషేదించిన BG-3 (కలుపు మందు తట్టుకొనే ) విత్తనాలను మరియు మిశ్రమ ఎరువులు, గ్లైఫోసేట్ అను కలుపు నివారణ మందును రైతులు కొనుగోలు చేయకూడదు.

4. ఎవరైనా డీలర్లు గాని వ్యక్తులు గాని నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించిన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు.

# భర్తకు భార్య దేహశుద్ధి



అశ్వారావుపేట : అమృత్ తెలంగాణ:అశ్వారావుపేట మండలం వినాయకపురం లో వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్తకు భార్య దేహశుద్ధి చేసింది. శనివారం వినాయకపురంకు చెందిన అబ్దుల్ హాఫీజ్ అనే వ్యక్తి తన ఇంట్లో భవాని అనే మహిళతో ఏకాంతంగా ఉండటం తెలుసుకున్న అతని భార్య ఫాతిమా వారిద్దరిని పట్టుకుంది. పట్టుబడిన ఇరువురికీ కుటుంబ సభ్యులతో కలిసి దేహశుద్ధి చేసి తాడుతో మొదట మంచానికి ఆ తర్వాత ఇంటి ముందు కిటికీ కి బంధించింది. ఈ సందర్భంగా భార్య ఫాతిమా మాట్లాడుతూ.. తన భర్త అబ్దుల్ హాఫీజ్ భవాని అనే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని తనను వేధింపులకు గురి చేసేవాడని, రెండేళ్లుగా తనని ఇద్దరు పిల్లల్ని పట్టించుకోవట్లేదని తెలిపింది. అక్రమ సంబంధం కారణంగానే భర్త తమ కుటుంబానికి దూరమయ్యాడు అని ఆరోపించింది. తనకు న్యాయం చేయాలంటూ భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. ఆమె వారిద్దరిని బంధించిన దృశ్యంతో పాటు తాను మాట్లాడిన విషయాలను రికార్డ్ చేసి స్థానిక వాట్సాప్ సమూహాల్లో విడుదల చేసారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని భర్త అబ్దుల్ హాఫీజ్ తో పాటు భవాని అనే మహిళను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించారుఈ విషయం అయి ఎస్.హెచ్.ఓ ఎస్ఐ యయాతి రాజు మాట్లాడుతూ ఈ భార్యాభర్తలు గొడవ పై కేసు నమోదు అయిందని తెలిపారు.

# శ్రీ కాలభైరవ స్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు

రామారెడ్డి :అమృత్ తెలంగాణ: మండలంలోని ఇసన్నపల్లి(రామారెడ్డి)లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయ హుండీ లెక్కింపును సహాయ కమిషనర్ వి విజయరామారావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రభు మాట్లాడుతూ రూ.2,72,759, మిశ్రమ బంగారం .40.980 మిల్లీ గ్రాములు, మిశ్రమా వెండి 8.680 మిల్లీగ్రాములు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, అర్చకులు శ్రీనివాస్ శర్మ, వంశి శర్మ, భక్త బృందం, మహిళా సంఘం తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసులకు, గిరిజనులకు చదువు వల్ల నే అభివృద్ధి సాధ్యం - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

గాదిగూడ మండలంలోని నాలుగు గ్రామాలలో పోలీసు మీకోసం కార్యక్రమాలు నిర్వహణ.
యువతకు స్పోర్ట్స్ కిట్స్ అందజేత.
గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచన.
డయల్ - 100, షీ టీం, విపిఓ పోలీసు సేవలను వినియోగించుకోవాలని అవగాహన.
గాదిగూడ మండలంలో త్వరలోనే ఆర్మీ అగ్ని వీర్ కు యువతకు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు
మారుమూల ఆదివాసి గ్రామాల సందర్శన.
ఆదివాసీలతో కలిసి సామూహిక భోజన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ.
త్వరలోనే జిల్లాలో జాబ్ మేళా నిర్వహణ, యువత పాల్గొని
లభించిన ఉద్యోగాలను చేస్తూ సద్వినియోగం చేసుకోవాలి.







అమృత తెలంగాణ ఉట్నూర్ న్యూస్ : ఆదిలాబాద్ జిల్లా అడవుల జిల్లా ఆదివాసీల జిల్లాగా పేరుంది, ఈ సందర్భంగా గాదిగూడ మండలం లోని మారుమూల గ్రామాలైనా కుండి, షేకు గూడ, పిప్రి (జి), పూనగూడ గ్రామాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్, ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్ తో కలిసి పోలీస్ మీకోసం కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. పోలీసు ముఖ్య అధికారి తమ గ్రామాలకు విచ్చేసిన సందర్భంలో మారుమూల ఆదివాసి గ్రామాల ఆదివాసులు జిల్లా ఎస్పీకి సాంప్రదాయ నృత్యాలతో డప్పు వాయిద్యాల నడుమ ఘన స్వాగతించి, ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా యువతకు జిల్లా ఎస్పీ ప్రత్యేక సూచనలు ఇస్తూ గ్రామాల నుండి బయటకు వచ్చి విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉన్నత విద్యను అభ్యసించి అభివృద్ధి చెందాలని దీనివల్ల తమ గ్రామాలను మండలాలను అభివృద్ధి దిశగా వెళ్లే విధంగా కృషి చేయాలని సూచించారు. యువతకు త్వరలోనే గాదిగూడ మండల కేంద్రం నందు ప్రత్యేకంగా ఆర్మీ అగ్ని వీర్ లో ఉద్యోగం వచ్చే విధంగా శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు పెద్ద ఎత్తున యువత పాల్గొని దేశ రక్షణలో తమ వంతు సేవలను అందించాలని తెలిపారు. అదేవిధంగా త్వరలోనే జిల్లాలో ప్రత్యేకంగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగం వచ్చిన ప్రతి ఒక్కరు వివిధ ప్రాంతాలలో ఉద్యోగ సేవలను చేయవలసి ఉంటుందని ప్రతి ఒక్కరూ సంసిద్ధమై ఉండాలని సూచించారు. గ్రామాలను వదిలి విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి పట్టణాలకు వెళ్లి ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలను నిర్వహించాలని తెలిపారు. యువత క్రీడారంగంలోనూ అభివృద్ధి చెందాలని నాలుగు గ్రామాలలోని యువతకు 2 క్రికెట్ కిట్లు,6 వాలీబాల్ కిట్లు,5 ఫుట్ బాల్ లు అందజేసి క్రీడారంగంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలు వైద్యుల సలహా మేరకే మందులను వాడాలని ఇంట్లో ఉన్న మందులను చిన్నచిన్న సమస్యలకు వాడకుండా ఉండడం శ్రేయస్కరమని సూచించారు. అనవసరంగా మందులను వాడిన వారికి కిడ్నీ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని సూచించారు. ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్ ను కేటాయించడం జరిగిందని తెలిపారు గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న అత్యవసరంగా స్పందించాలంటే డయల్ 100 లేదా విలేజ్ పోలీస్ ఆఫీసర్ సంప్రదించాలని తెలిపారు. మహిళల రక్షణకై మరియు యువతులు, విద్యార్థినిలు అత్యవసర సమయాలలో ఆదిలాబాద్ షీ టీం బృందాన్ని సంప్రదించాలని తెలిపారు. షీ టీం బృందాన్ని సంప్రదించడానికి 8712659953 కి ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. ముఖ్యంగా గ్రామాలలో గంజాయి సాగు చేయడం వల్ల దేశ భవిష్యత్తు మరియు యువత అనారోగ్య బారిన పడుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. గంజాయి సాగు , సేవించడం, వర్తకం చేయడం, పండించడం లాంటివి చట్ట వ్యతిరేకం గంజాయి సూచించిన నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. గంజాయి పండించడం వల్ల కేసులు నమోదు అవుతూ ప్రభుత్వం ద్వారా వచ్చే లబ్ధి రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గంజాయి దేశ భవిష్యత్తును నాశనం చేస్తుందని యువత చెడు మార్గాలను బారిన పడకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలి సూచించారు. అదేవిధంగా గ్రామాలలో వచ్చే బాబాలను నమ్మవద్దని ప్రభుత్వం ప్రైవేటు వైద్యులను సంప్రదించి సరైన వైద్యాన్ని తీసుకొని వైద్యులు సూచించినటువంటి మందులను మాత్రవే వాడేలా ప్రజలందరూ ఉండాలన్నారు. మండలంలో ఎలాంటి గంజాయి సమాచారం ఉన్న అసాంఘిక కార్యక్రమాల సమాచారం అయిన మెసేజ్ యువర్ ఎస్పీ కార్యక్రమంలోని ప్రత్యేకంగా జిల్లా ఎస్పీ గారి చే నిర్వహించబడుతున్న 8712659973 నెంబర్ కు వాట్సప్ ద్వారా సమాచారాన్ని అందించవచ్చని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ సీఐ రహీం పాషా, గాదిగూడ ఎస్ఐ ఎస్ జీవన్ రెడ్డి, ఆదివాసి నాయకుడు మెస్రం శేఖర్, యోగేష్, కుండి గ్రామ పటేల్ లక్ష్మణ్ పటేల్, షేక్ గూడ గ్రామ పటేల్ పైకు, పిప్పిరి గ్రామ పటేల్ సిడాం జంగు, పూనగుడ గ్రామ పటేల్ పెందుర్ రమేష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్, ఆర్ / బీ శాఖల మౌలిక సదుపాయాల పనులకు అటవీ శాఖ అనుమతుల జాప్యం తలెత్తుతోంది.





అమృత్ తెలంగాణ అదిలాబాద్ బ్యూరో న్యూస్ : ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో పంచాయతీరాజ్, ఆర్ / బీ శాఖల మౌలిక సదుపాయాల పనులకు అటవీ శాఖ అనుమతుల జాప్యం తలెత్తుతోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు శనివారం హైదరాబాద్ సచివాలయంలో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ భేటీలో అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో పాటు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, సీసీఎఫ్‌లు, డీఎఫ్ఓలు, ఐటిడిఏ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు వెడ్మా బొజ్జు పటేల్, కోవా లక్ష్మీ, పాల్వాయి హరీష్, అనిల్ జాదవ్, ఎంఎల్సీ దండే విఠల్‌లు మాట్లాడారు. అటవీ అనుమతులు ఆలస్యమవడం వల్ల అభివృద్ధి పనులు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. అధికారుల నివేదికలు, ప్రజాప్రతినిధుల సూచనలు పరిగణనలోకి తీసుకున్న మంత్రులు, సమస్యను త్వరగా పరిష్కరించి అభివృద్ధి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శాఖల మధ్య సమన్వయంతో పనుల వేగాన్ని పెంచాలని నిర్ణయించారు.

# మహిళల భద్రతయే..మా మొదటి ప్రాధాన్యత.

## విద్యార్థినిలు భద్రతకు సంబంధించి ఏ సమస్య ఉన్న నిర్భయంగా ఫిర్యాదు చేయండి.







అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశాలతో ఈ రోజు నారాయణ స్కూల్ లో పోక్సొ చట్టాల మీద , చైల్డ్ మ్యారేజ్, జువెనైల్ చట్టాలమీద గంజా గస్తి ప్రోగ్రామ్ మీద గవర్మెంట్ టీచర్స్ కి అవగాహన కల్పించి , వాళ్ళు పిల్లలకు అవగాహన కల్పించే విధంగా షి టీం ఎస్ఐ బిట్ల పెర్సిస్ అవాగాహన కల్పించడం జరిగింది. నిర్మల్ లో గంజా పూర్తిగా రూపుమపడానికి ప్రతి ఒక్క టీచర్ తమవంతు సహకారం చేస్తూ సమాచారం ఉన్న లేదా తమ వద్ద చదువుకునే పిల్లల నడవిడక అనుమానాస్పదంగా ఉంటే వెంటనే 8712659599 అనే నంబర్ కి సమాచారం అందించగలరని అని తెల్పినారు.మహిళలు వేధింపులకు గురైనట్లు అయితే షీ టీమ్ నెంబర్ 8712659550 లేదా డయల్ 100 కు పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు. మహిళల,విద్యార్థినిల భద్రతకు సంబంధించి ఏ సమస్య ఉన్న నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని,మహిళ భద్రతయే పోలీస్ శాఖ మొదటి ప్రాధాన్యత అని,విద్యార్థిని విద్యార్థులు సోషల్ మీడియాకి దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకోనెటట్లు ప్రోత్సాహించమని జిల్లా she team in-charge అధికారి ఎస్ఐ పెర్సిస్ ఈ రోజు నిర్మల్ పట్టణం లోని నారాయణ స్కూల్ లో she team ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మహిళ రక్షణ, షీ టీమ్స్,ఈవ్ టీజింగ్ ,పోక్సో ,సైబర్ క్రైమ్స్, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఇట్టి కార్యక్రమంలో పెర్సిస్ ఎస్ఐ, షి టీం సిబ్బంది, గవర్నమెంట్ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సుమారు 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# టీపీసీసీ చీఫ్ బర్త్ డే.. పేదలకు సరుకుల పంపిణీ

కంఠేశ్వర్: అమృత్ తెలంగాణ:కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రథసారథి బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ నగరంలోని అభయహస్తం కాలనీలో మల్యాల గోవర్ధన్ ఆధ్వర్యంలో కాలనీ ప్రజలకు శనివారం 12 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ప్రతినిధిగా క్రమశిక్షణ కలిగిన కార్యకర్త స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర రథసారధిగా ఎదిగిన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారు క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలకు స్ఫూర్తి దాయకం అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని అభయ హస్తం కాలనీలో 50 నిరుపేద కుటుంబాలకు సుమారు రూ.1000విలువ గలిగిన 12 రకాల నిత్యవసర వస్తువులు, కూరగాయలు, పంపిణీ చేయడం జరిగింది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిరుపేద ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేస్తుందని, రాబోయే కాలంలో రేషన్ షాపు ద్వారా నిత్యవసర వస్తువులను పంపిణీ చేయాలని కోరుతూ ఈ విధమైన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అభయహస్తం కాలనీ ప్రజలు నర్సింగ్, నాగిరెడ్డి, జమీర్, స్వరూప, రాధిక, సంతోష్, రమాదేవి, స్వర్ణ, నసీమ, అంజు తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీపై జనుము, జీలుగా విత్తనాలు: ఎమ్ఏఓ రమేష్



శామీర్ పేట:అమృత్ తెలంగాణ: సబ్సిడీపై జనుము జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శామీర్ పేట మండల వ్యవసాయ అధికారి సిహెచ్ రమేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు వేయడం వలన భూమి సారవంతం పెరిగి పంట దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులు జనుము, జీలుగా విత్తనాలు 50 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని, జనుము 40 కిలోల బస్తా పూర్తి ధర రూ.5020/- , సబ్సిడీ రూ.2510/- రైతు ధర రూ.2510/- రేటుకు అందిస్తున్నాము. జీలుగా 30 కిలోల బస్తా ధర రూ.4276/- సబ్సిడీ రూ.2138/- రైతు ధర రూ.2138/- అందుబాటులో ఉందని తెలిపారు. విత్తనాలు

తీసుకోవాలనుకునే రైతులు తమ పట్టాపాస్తు పుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలతో ఏమ్ఏఓ లను సంప్రదించాలని తెలిపారు.

# ఆరోగ్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గా చేపూరు వాసి

ఆర్మూర్ :అమృత్ తెలంగాణ: మండలంలోని చేపూర్ గ్రామానికి చెందిన మోహన్ దాస్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆరోగ్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గా ప్రమోషన్ పొందినట్లు దళిత ఐక్య సంఘటన డివిజన్ పూర్వ ప్రధాన కార్యదర్శి జంగం అశోక్ శనివారం తెలిపారు. ఆయన ప్రస్తుతం నాగర్ కర్నూల్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్నారని, ప్రమోషన్ పొందడం హర్షనీయమని గ్రామస్తులు తెలిపారు.

# కడపజిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఐదుగురు మృతి

## చనిపోయిన వారందరూ బద్వేల్ వాసులే

## కడప రిమ్స్ లో బాధితులను పరామర్శించిన టిడిపి వైసిపి నాయకులు

## జిల్లా కలెక్టర్ శ్రీధర్ తో ఫోన్లో మాట్లాడిన రెండు పార్టీల నాయకులు













బద్వేలు. అమృత్ తెలంగాణ: కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ, కారు ఢీకొన్న ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. రాయచోటి నుంచి కడపకు కారులో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గువ్వలచెరువు ఘాట్ రోడ్డు వద్దకు కారు రాగానే వెనుక వైపు నుంచి లారీ అతివేగంగా ఢీకొంది. ఆ వేగానికి లారీ కారుపై పడడంతో కారులో ఉన్న ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఒక చిన్నారి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కారుపై పడ్డ లారీని తీసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇంకా వాహనంలో ఎవరైనా ఉన్నారా అనేది తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బద్వేల్ నియోజకవర్గం చింత పుతాయపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఈ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మరికొందరికి గాయాలయ్యాయి. వీరందరినీ కడప రిమ్స్ హాస్పిటల్ కు తరలించారు. రోడ్డు ప్రమాదం విషయం తెలిసిన వెంటనే బద్వేల్ నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ రితీష్ రెడ్డి గారు హుటాహుటిన కడప రిమ్స్ కి వెళ్లారు. మృతి చెందిన శ్రీనివాసులు భౌతికాయని సందర్శించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మిగతా వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు. అక్కడికక్కడే కడప జిల్లా కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడి రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికీ మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. మృతి చెందిన వారికి ఎక్స్గ్రేషియా ప్రకటించాలన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన బద్వేల్ నియోజక వర్గ శాసన సభ్యురాలు డా.దాసరి సుధ

కడప జిల్లా గువ్వల చెరువు ఘాట్ దగ్గర లారీ కారు ను ఢీ కొట్టిన సంఘటనలో బద్వేల్ మున్సిపాలిటీ చింతపూతయ పల్లె కి చెందిన శ్రీకాంత్ రెడ్డి వారి సతీమణి శ్రీమతి సునీత అక్కడిక్కడే మృతి చెందడం జరిగింది వారి తో పాటు వారి వదిన పిల్లలు ఇద్దరు కూడా మృతి చెందడం జరిగింది వీరి బంధువులు మరో ఇద్దరు గాయపడటం జరిగింది.ఇది తెలిసిన వెంటనే గౌరవ బద్వేల్ నియోజక వర్గ శాసన సభ్యురాలు శ్రీమతి డా.దాసరి సుధ మేడం గారు హుటా హుటిన కడప రిమ్స్ దగ్గరకు వెళ్ళి మొదటగా గాయమైన వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్స్ కు సూచించారు అనంతరం మార్చురీ కి వెళ్ళి వారి భౌతికకాయాన్ని సందర్శించి వెంటనే పోస్టు మార్టం చేయాలని డాక్టర్స్ కు సూచించడం జరిగింది.అనంతరం పోలీస్ లతో మాట్లాడి వెంటనే కేసు నమోదు చేయాలని సూచించారు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చడం జరిగింది .

# ప్రధాన డ్రైనేజీ పూడిక తీత పనులు శరవేగంగా జరుగుతున్నాయి



బాపట్ల :అమృత్ తెలంగాణ:, పురపాలక సంఘ పరిధిలో మచ్చావారి పాలెం వద్ద నిన్నటి నుండి చేపట్టిన ప్రధాన డ్రైనేజీ పూడిక తీత పనులు శరవేగంగా జరుగుతు న్నాయి. డ్రైనేజీ నందు అధికంగా పేరుకుపోయిన గుఱ్ఱపుడెక్క ను తొలగించడం జరుగుతుంది.శానిటరీ శానిటరీ ఇన్స్పెక్టర్ వారు మరియు మునిసిపల్ ఇంజనీర్ వారు సమిష్టి సమన్వ యంతో నిరంతరం పర్యవేక్షించి డ్రైనేజీ పుడిక తీత పనులను పూర్తి చేయాలని సూచించారు.అలాగే సూర్యలంక రోడ్డు శ్రీ చైతన్య కాలేజీ వద్ద నుండి ఎ.జికాలేజీ వరకు చేపట్టిన డ్రైనేజీ పూడిక పనులు మునిసిపల్ కమిషనర్ .జి.రఘునాథ రెడ్డి స్వయంగా పరిశీలించారు.అనంతరం సూర్యలంక రోడ్ లోని అన్నక్యాంటీనును పరిశీలించినఅయన రికార్డులను పరిశీలించారు. అక్కడికి వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి కల్పించిన సౌకర్యాలను గురించి మాట్లాడారు.అనంతరం ఉప్పరపాలెం రోడ్ లోని పాత తహసిల్దారు వారి గృహ సముదాయ స్థలాన్ని పరిశీలించారు.గత కొన్ని సంవత్సరాలుగా పాడు పడిపోయిఉన్నసదరు స్థలాన్నిబాగుచేయుపనులను పరిశీలించారు.వారి వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ సి.హెచ్. కరుణా ఉన్నారు.

# బ్రిలియెన్స్ డైమండ్ జ్యువలరీ షోను ప్రారంభించిన జోయాలుక్కాస్.




విజయవాడ అమృత్ తెలంగాణ: భారతదేశం- వరల్డ్స్ ఫేవరెట్ జ్యువలర్ జోయాలుక్కాస్, విజయవాడలో నవీకరించబడిన షోరూంలో అధికారికంగా తమ బ్రిలియెన్స్ డైమండ్ జ్యువలరీ షోను ప్రారంభించింది- నగర జ్యువలరీ దృశ్యం అద్భుతంగా మళ్లీ వచ్చిందని ఇది సూచిస్తోంది. గొప్ప పునః ప్రారంభోత్సవం సంబరంలో భాగంగా ప్రారంభించబడిన ఈ షో పోషకులకు ప్రీమియం డైమండ్ జ్యువలరీలో కట్ మరియు అన్ కట్ డైమండ్ మరియు అరుదైన మరియు ప్రత్యేకమైన కలక్షన్స్ యొక్క అద్భుతమైన శ్రేణిని అందిస్తోంది. సొగసుదనం, వ్యక్తిగతత్వం సంబరం చేయడానికి రూపొందించబడిన బ్రిలియెన్స్ డైమండ్ జ్యువలరీ షో శాశ్వతమైన సౌందర్యానికి మరియు ఆధునికమైన కళాపనిత నానికి ఒక నివాళి. సంబరంలో భాగంగా, జోయాలుక్కాస్ రూ. 1 లక్ష లేదా ఎక్కువ విలువైన డైమండ్ జ్యువలరీ ప్రతి కొనుగోలు పై షాపర్స్ కు ప్రతి కొనుగోలు పై తప్పనిసరిగా బహుమతితో పాటు 1 గ్రా గోల్డ్ కాయిన్ అందిస్తోంది. ప్రతి కొనుగోలుకు మరింత మెరుపును చేర్చడానికి మరియు జ్యువలరీ ప్రేమికుల కోసం షోరూం మళ్లీ ఏర్పాటైందని జ్ఞాపకానికి గుర్తుగా ఈ పరిమిత సమయం ఆఫర్లు రూపొందించబడ్డాయి.

జాయ్ అలుక్కాస్, జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, ఇలా అన్నారు:" ద బ్రిలెయెన్స్ డైమండ్ జ్యువలరీ షో అనేది విజయవాడలో మా విలువైన పోషకులకు మాదైన శైలిలో తెలియచేసే కృతజ్ఞతలు. మా శ్రేష్టత వారసత్వాన్ని ప్రదర్శించే ప్రత్యేకమైన డిజైన్లు మరియు ఆలోచనాత్మక మైన ఆఫర్లతో మేము ప్రత్యేకమైన అనుభవాన్ని రూపొందిం చాము. మాతో కలిసి సంబరం చేయడానికి ప్రతి ఒక్కర్ని మేము ఆహ్వానిస్తున్నాం మరియు అన్వేషించవలసిందిగా కోరుతున్నాం." షో ప్రాధాన్య తను సంతరించుకున్న నేపథ్యంలో, విజయవాడలో కొత్తగా రూపొందించబడిన షోరూం మూడు అందంగా రూపొందించబడిన

అంతస్థులలో సొగసైన మరియు విలాసవంతమైన షాపింగ్ అనుభవాన్ని అందిస్తుంది, ఇక్కడ కావలసినంత పార్కింగ్ స్థలం, విశాలమైన ఇంటీరియర్లు మరియు ప్రపంచ స్థాయికి చెందిన సేవలు అందుబాటులో ఉన్నాయి. బ్రిలియెన్స్ డైమండ్ జ్యువలరీ షో ఇప్పుడు విజయవాడలోని జోయాలుక్కాస్ లో సందర్శకులు అందరికీ అందుబాటులో ఉంది.

# సీతకి వయసు తో వచ్చిన కష్టాలు పాపం..!



సీతారామం సినిమా తో తెలుగు లో ఒక్కసారిగా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. హిందీలో ఈమె సినిమాల్లో ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయ్యింది.. అంతకు ముందే సీరియల్స్ లో కూడా ఈ అమ్మడు చాలానే పాపులారిటీని సొంతం చేసుకుంది. కానీ ప్రస్తుతం దక్కిన స్టార్ డమ్.. సూపర్ హిట్ మాత్రం ఆమెకు ఇన్నాళ్ల సినీ కెరీర్ లో దక్కలేదనే చెప్పాలి. దుల్కర్ సల్మాన్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన సీతారామం సినిమాలో సీత పాత్రకు అచ్చు గుద్దినట్లుగా అద్భుతంగా సెట్ అవ్వడంతో ప్రతి ఒక్కరు కూడా ఫిదా అయ్యారు.. ఇంకా కూడా అవుతూనే ఉన్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో వరుసగా సినీ ఆఫర్లు దక్కించుకుంటున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయాలు ఆసక్తికరంగా మారాయి. ఒక పాత్ర కోసం వేశ్య గృహంలో ఉండాల్సి వచ్చిందని చెప్పిన మృణాల్ ఠాకూర్ కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి పలు ఆసక్తికర విషయాలను చెప్పింది. ఇదే సమయంలో ఆమె తన వయసు గురించి కాస్త అసహనంతో మాట్లాడింది. నా వయసు ప్రస్తావన వచ్చిన ప్రతి సారి కూడా చాలా మంది పెళ్లి గురించి అడుగుతూ ఉంటారని.. ప్రేమ లో పడలేదా అంటూ ఆశ్చర్యంగా ఫేస్ పెడతారు అంటూ మృణాల్ పేర్కొంది. నా వయసు 30 ఏళ్లు అంటూ చెప్పగానే మీరు పెళ్లి చేసుకోవాల్సిన సమయం వచ్చినట్లుంది.. పెళ్లి పై మీ యొక్క అభిప్రాయం అంటూ చాలా మంది ప్రశ్నలతో ముంచెత్తుతున్నారు. ఎన్నో సార్లు సమాధానం చెప్పినా కూడా ప్రేమ గురించి నన్ను ఎప్పుడూ ఎవరో ఒకరు ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రేమ గురించి నాకంటూ ఒక అవగాహణ ఉందని మృణాల్ పేర్కొంది.

# వెబ్ సిరీస్ లో ఊర్మిళ దుమారం తప్పదా?



బాలీవుడ్ బ్యూటీ ఊర్మిళ మండోత్కర్ నాలుగేళ్లగా సినిమాలకు దూరంగా ఉంటోన్న సంగతి తెలిసిందే. అవకాశాలు రాక...సరైసనన పాత్రలు దొరకక గ్యాప్ ఇచ్చిందా? అన్నది క్లారిటీ లేదు గానీ..ఊర్మిళ తెరపై ఎప్పుడు కనిపించినా ఓ సంచలనమే అన్నది వాస్తవం. యాభైకి చేరువలోనూ ఊర్మిళ ధగధగల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వెండి తెరపై మెరిసిన అమ్మడు బుల్లి తెరపైనా తనదైన మార్క్ వేసింది. పలు రియాల్టీ షోలను హోస్ట్ చేసి ఐడెంటీ వేసింది. ప్రస్తుతం డిడ్ సూపర్ మామ్స్ సీజన్ -3రని హోస్ట చేస్తోంది. తాజాగా ఊర్మిళ వెబ్ సిరీస్ లకు సై అనేసింది. 'తివారీ' అనే వెబ్ సిరీస్ కి కమిట్ అయినట్లు తెలుస్తోంది. ఇందులో ఆమె ద్విపాత్రాభినయం చేస్తుంది. తల్లి -కుమార్తె నేపథ్యంలో సాగే స్టోరీ కావడంతో ఆ రెండు పాత్రలు కూడా ఆమె పోషిస్తుందిట. పాత్రలకు సంబంధించి ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటుందిట. గత ఆరు నెలలుగా అదే పనిలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పాత్రల గురించి స్పందించింది. ' నాలోని నటికి తివారీ సవాల్ విసురుతుంది. ఇందులో అనుబంధాలే కాదు.. ఊహించని మలుపు యాక్షన్ సన్నివేశాలు..రొమాంటిక్ సీన్లు ఉంటాయని' రివీల్ చేసింది. మొత్తానికి ఊర్మిళ సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ గట్టిగానే ఊపేటట్లు కనిపిస్తుంది. స్టార్ హీరోయిన్ గా కొనసాగినంత కాలం బాలీవుడ్ ని ఓ ఊపు ఊపేసింది. ఆ తర్వాత ఒక్కసారిగా చల్లబడింది. కొంత కాలంగా సరైన అవకాశాలు రావడం లేదు. ఈ క్రమంలో కొంత గ్యాప్ వచ్చింది. మళ్లీ ఇప్పుడు ఓటీటీని షేక్ చేయడానికి రెడీ అవుతోంది. ప్రస్తుతం వెబ్ సిరీస్ ల్లోకి స్టార్ హీరోయిన్లు సైతం ఎంట్రీ ఇస్తున్నారు. ఈక్రమంలో అక్కడా పోటీ వాతావరణం కనిపిస్తుంది. ఒకరికొకరు పోటీ పడుతూ సత్తా చాటుతున్నారు. వెండి తెరను మించి ఓటీటీ బోల్డ్ కంటెంట్ లో విచ్చలవిడిగా నటించడానికి ఎలాంటి అడ్డంకులు పెట్టడం లేదు. ఛాన్స్ ఇవ్వాలే గానీ.. దర్శకుడి సృతజాన్మతకని మించి పెర్ఫార్మెన్స్ ఇస్తున్నారు. మరి ఆ రకంగా ఊర్మిళ కూడా రేసులో నిలుస్తుందా? అన్నది చూడాలి. ఊర్మిళ తెలుగులోనూ అంతే ఫేమస్. ఆమె 'అంతం'..'గాయం'..'అనగనగా ఒక రోజు' లాంటి తెలుగు చిత్రాల్లో నటించిన సంగతి తెలిసిందే.

# మంచి ఆఫర్లు రాబడుతున్న 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్'



'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' సినిమా అక్టోబర్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో మేకర్స్ ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ చిత్రం నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సోషల్ మీడియా సర్కిల్స్ లో మంచి సంచలనం సృష్టించింది. చిత్రాన్ని ఎక్కువ మంది ప్రేక్షకులను చేరుకోవడానికి మేకర్స్ తమ ప్రయత్నాలను రెట్టింపు చేస్తున్నారు. ఇంతకుముందు విడుదల చేసిన క్రేజీ ట్రైలర్ మరియు ప్రమోషనల్ సాంగ్ సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేశాయి. ఇది బయ్యర్ల నుండి మంచి ఆఫర్లు రావడానికి దోహదపడినట్లు సమాచారం. 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' చుట్టూ నెలకొన్న హైప్ దృష్ట్యా ఈ సినిమా ఆంధ్ర నైజాం మరియు సీడెడ్ ఏరియాలకు బయ్యర్లు సుమారు 3 కోట్ల కోట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. యునిక్ కాన్సెప్ట్.. ప్రత్యేకమైన కథనం ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఇస్తుందని సినీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా సినిమా ప్రీ క్లైమాక్స్ పార్ట్ ఎప్పుడూ చూడని ఎమోషన్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందని అంటున్నారు. అలాగే సంగీతం సినిమాటోగ్రఫీ మరియు క్రిస్పీ ఎడిటింగ్ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని పేర్కొంటున్నారు. దీన్ని బట్టి చూస్తే 'బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్' సినిమా మంచి బిజినెస్ డీల్ తో ముగించే అవకాశం ఉందని అనుకోవచ్చు. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ లో విశ్వంత్ - మాళవిక సతీషన్ హీరోహీరోయిన్లుగా నటించారు. ఫైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ మరియు స్వస్తిక సినిమా బ్యానర్స్ పై నిరంజన్ రెడ్డి - వేణు మాధవ్ పెద్ది సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు



ఈశాన్యామహేశ్వరి హాట్ ఇన్ రెడ్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com